క్లుప్తంగా

సాగునీరు విడుదల



సాగునీరు విడిచిపెడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు: శివారు భూములకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పెద్దదూగం వద్ద ఎస్‌బీసీ (నరసన్నపేట బ్రాంచ్) కాలువకు సోమవారం సాగునీరు విడిచిపెట్టారు. కాలువలకు అడ్డకట్ట వేయకుండా అన్ని ప్రాంతాలకు నీరు వెళ్లేలా అధికారులు పర్యవేక్షణ ఉండాలన్నారు. నియోజకవర్గం పరిధిలో సాగునీటి కాలువలకు తాత్కలిక మరమ్మతులు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈలు శ్రీహరి, సురేష్, టీడీపీ నాయకులు మెండ, తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను తొలగించారు



ఖాళీ కొబ్బరిబొండాలు తొలగిస్తున్న కార్మికులు



సారవకోట: మండలంలోని బుడితి నుంచి బద్రి వెళ్లే రాహదారిలో లక్ష్మీపురం గ్రామానికి సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న ఖాళీ కొబ్బరి బొండాలను సోమవారం తొలగించారు. ఆదివారం సాక్షిలో రోడ్డా.. డంపింగ్ యార్డా అనే వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఈఓపీఆర్డీ రేణుక పంచాయతీ కార్యదర్శికి తగిన సూచనలు చేసి వాటిని తొలగించే ఏర్పాటు చేశారు.

ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

జలుమూరు: మర్రివలస పంచాయతీ పరిధి ఎస్టీ మాకివలస గిరిజనుల భూముల రక్షణకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సంఘం నాయకుడు వాబ యోగేశ్వరరావు డిమాండ్ చేశారు. జలుమూరులో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ నాగమ్మకు వినతిపత్రం అందించారు. గిరిజనులు భూములు కాజేసిన పెత్తందార్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

108 వాహనం తనిఖీ



పరికరాలు, మందులను పరిశీలిస్తున్న నవీన్ కుమార్

బూర్జ: మండలంలోని కొల్లివలస గ్రామంలో ఉన్న 108 వాహనాన్ని డివిజన్ అధికారి ఎల్. నవీన్ కుమార్ సోమవారం తనిఖీ చేశారు. వాహనం పనితీరు, వాహన రికార్డులను పరిశీలించారు. రోగులకు అవసరమైన వైద్య పరికరాలు, మందులను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలన్నారు. వాహనం నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. 108 ఈఎంటీ బొడ్డేపల్లి పోలినాయుడు, పైలెట్ కొంచాడ సూర్యనారాయణ పాల్గొన్నారు.

రూ.లక్ష ఆర్థికసాయం



సూరమ్మకు చెక్‌ను అందజేస్తున్న డాక్టర్ రెడ్డీస్ యాజమాన్యం ప్రతినిధులు

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం పంచాయతీలో గల సరగడపేట గ్రామానికి చెందిన యాగాటి సూర్యనారాయణ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ రెడ్డీస్ యాజమాన్యం సామాజిక కార్పొరేట్ బాధ్యతగా లక్ష రూపాయల చెక్కును సూర్యనారాయణ భార్య సూరమ్మకు సోమవారం అందజేశారు. డాక్టర్ రెడ్డీస్ పైడిభీమవరం యూనిట్ హెడ్ కె.వి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ పరిసర ప్రాంతవాసులకు అండగా నిలుస్తున్నామన్నారు. రెడ్డీస్ హెచ్‌ఆర్‌లు దీపక్, జోగారావు, పైడిభీమవరం టీడీపీ నాయకుడు రౌతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇస్తారా.. ఎగవేస్తారా?

- అధికారంలోకి వచ్చి నెల దాటినా చర్యలు శూన్యం
- ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూపులు
- గత అనుభవాల దృష్ట్యా నిరుద్యోగుల్లో ఆందోళన

అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటికి ఒక ఉద్యోగం కల్పిస్తామని, లేదంటే నిరుద్యోగ భృతిగా నెలకు మూడు వేల రూపాయలు అందజేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ హామీ ఎప్పుడు అమలు చేస్తారోనని నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుని స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతున్నారు. ఎప్పటి నుంచి నిరుద్యోగ భృతి ఇస్తారో చెప్పాలని, అర్హులందరికీ భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మాదిరిగా లక్షల సంఖ్యలో ఉద్యోగాలు ఇవ్వాలని వేడుకుంటున్నారు. నిరుద్యోగుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

–సాక్షి నెట్‌వర్క్

మార్గదర్శకాలు జారీ చేయాలి



గతంలో కూడా ఇదే మాదిరిగా మోసం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలరోజులు కావస్తున్నా ఇంతవరకూ నిరుద్యోగ భృతి అమలు చేయలేదు. కనీసం దీని గురించి మార్గదర్శకాలు కూడా జారీ చేయలేదు. ఇదో ఆర్భాటపు ప్రకటనగా మిగిలిపోతుందన్న ఆందోళన కనిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

– అల్లు కృష్ణారావు, దుర్భలాపురం, హిరమండలం మండలం

క్యాలెండర్ విడుదల చేయాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడానికి క్యాలెండర్ విడుదల చేయాలి. తమకు నచ్చినప్పుడు హామీలు నెరవేర్చుతామంటే ఎలా అవుతుంది. ఎన్నికల్లో టీడీపీ కూటమి ఇచ్చిన హామీల మేరకు ప్రజలు ఓటు వేసి గెలిపించారు. ప్రధానంగా ఇంటికో ఉద్యోగం కల్పిస్తామన్నారు. ఈ లోగా నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ నిచ్చారు. ఏ విధంగా ఇస్తారో.. విధివిధానాలు ఏమిటో ప్రకటించాలి.

– ధర్మాన కృష్ణదాస్, మాజీ డిప్యూటీ సీఎం

ఎంతో తోడ్పాటుగా ఉంటుంది



గతంలో మాదిరిగా నిరుద్యోగులను మోసం చేయకుండా నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలి. ఉద్యోగాలు కల్పించే వరకు ఆర్థిక సహాయంగా ఉంటుంది. విధివిధానాలు ప్రకటించాలి.

– యండవ శ్రీదేవి, దొంకలపర్త, బూర్జ మండలం

నిరుద్యోగ భృతిపై ప్రకటన చేయాలి



నిరుద్యోగులకు భృతి రూ.3 వేలు ఇస్తామని ఎన్నికల ముందు టీడీపీ కూటమి ప్రభుత్వం హామీ నిచ్చింది. దీనిని ప్రకటించాలి. నిరుద్యోగ భృతి కోసం యువతీ, యువకులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు పైబడుతుంది. ఇప్పటికైనా స్పందించి నిరుద్యోగ భృతి ఎప్పుడు నుంచి ఇస్తారో ప్రకటించాలి.

– ముద్దాడ సతీష్, ముద్దాడపేట, నరసన్నపేట మండలం

ఉద్యోగాలు ఇవ్వాలి



యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఉద్యోగం లేనివారికి నిరుద్యోగ భృతి నెలకు రూ.మూడు వేలు అందిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగాలు లేదంటే నిరుద్యోగ భృతి అందించాలి.

– లుకులాపు గౌతమ్ కుమార్, కరకవలస కాలనీ, జలుమూరు మండలం

ఉపాధి అవకాశాలు కల్పించాలి



ఎన్నికల సమయంలో ఇంటికో ఉద్యోగం, లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేకపోతే నిరుద్యోగ భృతి అందజేయాలి. ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పి.విష్ణుమూర్తి, యంబరాం, ఎల్.ఎన్.పేట

అర్హతలు ప్రకటించాలి



కూటమి ప్రభుత్వం గెలిచిన వెంటనే అర్హత మేరకు ఉద్యోగం ఇస్తామని చంద్రబాబు చెప్పారు. ఉగ్యోగం ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగం కల్పించాలి. లేకపోతే నిరుద్యోగ భృతి మంజూరు చేయాలి.

– గార రాజులు నాయుడు, మాకవరం, కొత్తూరు మండలం

ఎప్పుడు ఇస్తారో చెప్పాలి



కూటమి ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రకారం నిరుద్యోగులకు ఉద్యోగమివ్వాలి, లేకపోతే నిరుద్యోగ భృతి కల్పించాలి. నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారో స్పష్టంగా ప్రకటించాలి.

– బగాది శ్రావణ్‌కుమార్, కూర్మనాథపురం, సారవకోట మండలం

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



ఉద్యోగాలు వస్తాయని ఎంతో నమ్మకంతో ఉన్నాం. ఉద్యోగా కల్పనకు పెద్ద ఎత్తున నోటీఫికేషన్లు వేయాలి. ఉపాధ్యాయ, అన్ని శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలి. ఉద్యోగం లేని వారికి భృతి నెలకు రూ.మూడు వేల భృతి అందించాలి.

– ఉప్పాడ రమేష్, కె.ఎల్.ఎన్‌పేట, జలుమూరు మండలం



బాబు నిరుద్యోగ భృతి ఎప్పుడు

ఎదురుచూస్తున్నాం



యువతకు ఉపాధి కల్పిస్తామని, లేక పోతే నిరుద్యోగి భతి ఇస్తామని కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ మెనిఫెస్టోలో చెప్పింది. ఇంతవరకు ఉద్యోగాల ప్రకటన లేదు. రుద్యోగి భృతి ఎప్పుడు ఇస్తారో చెప్పలేదు. నిరుద్యోగి భృతి కోసం ఎదురు చూస్తున్నాం. చంద్రబాబు మాట నిలబెట్టు కోవాలి. డిగ్రీలు చదివి ఉద్యోగం నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నాం. ఉద్యోగం రాకపోతే నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– బీశెట్టి చంటిబాబు, ఉప్పరవీధి, పాతపట్నం

ఆసరాగా ఉంటుంది



అధికారంలోకి రాగానే మొదటి నెల నుంచి ప్రతి ఇంట్లో ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగం కల్పిస్తానని, లేకపోతే రూ.3 వేలు నెలకు అందిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే ఈ విషయాన్ని విస్మరించారు. ఉద్యోగాల కోసం వేచి ఉన్న యువతకు నిరుద్యోగ భృతి ఆసరాగా ఉంటుంది.

– గేదెల రామకృష్ణ, గేదెలవానిపేట, ఆమదాలవలస మున్సిపాలిటీ

నరసన్నపేట నియోజకవర్గంలోని కుటుంబాల వివరాలు ఇలా..	
మండలం	కుటుంబాలు
నరసన్నపేట	23,537
సారవకోట	16,485
పోలాకి	21,307
జలుమూరు	19,217
పాతపట్నం నియోజకవర్గంలోని కుటుంబాల వివరాలు ఇలా..	
మండలం	కుటుంబాలు
పాతపట్నం	20,299
మెళియాపుట్టి	16,675
కొత్తూరు	22,634
ఎల్.ఎన్.పేట	10,961
హిరమండలం	12,241
ఆమదాలవలస నియోజకవర్గంలోని కుటుంబాల వివరాలు ఇలా..	
మండలం	కుటుంబాలు
ఆమదాలవలస	25,835
సరుబుజ్జిలి	9,900
బూర్జ	13,601
పొందూరు	22,775

హామీ అమలు చేయాలి



అధికారం కోసం అమలు సాధ్యం కాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేయటం చంద్రబాబుకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదు. 2014 ఎన్నికల సమయంలోనూ అమలు సాధ్యం కాని 600 హామీలు ఇచ్చి అధికారం పొందారు. ముఖ్యమంత్రి అయ్యాక హామీలను గాలికి వదిలేశారు. 2024 ఎన్నికల ముందు కూడా సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయటానికి ఈ ఐదేళ్ల పాలన సరిపోతుంది. ఇంటికో ఉద్యోగం ఇవ్వలేక పోతే నిరుద్యోగ భృతి అన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయాలి.

– రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే, పాతపట్నం

ఉత్తమ క్లబ్‌గా తీర్చిదిద్దుతా..

- అధ్యక్షుడు రమణ సాహు
- సందడిగా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



రమణ సాహుకి బాధ్యతలు అప్పగిస్తున్న సదాశివుని కృష్ణ, తదితరులు

నరసన్నపేట: స్థానిక మిలీనియం లయన్స్ క్లబ్‌ను లయన్స్ డిస్ట్రిక్ట్ 316–ఏ పరిధిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని క్లబ్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రమణ సాహు అన్నారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఓ రెస్టారెంట్‌లో ఆదివారం రాత్రి నరసన్నపేట మిలీనియం లయన్స్ క్లబ్ 2024–25 నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రమణసాహు మాట్లాడుతూ ఈ క్లబ్ 2000 సంవత్సరంలో ఏర్పాటు చేశామన్నారు. క్లబ్ విధివిధానాలు, చేపడుతున్న సేవా కార్యక్రమాలను ముఖ్య అతిథులుగా హాజరైన డి.ఎస్.ఎస్.వి.వర్మ, కె.వి.సుబ్బరాజులు వివరించారు. మంచి సేవా కార్యక్రమాలు చేపట్టి క్లబ్ ప్రతిష్ఠను మరింత పెంచాలని సూచించారు. నూతన కార్యవర్గంలో కార్యదర్శిగా కలివరపు సాయిరాం, ట్రెజరర్‌గా కోరాడ వైకుంఠరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ ప్రెసిడెంట్ సదాశివుని కృష్ణ, ఊణ్ణ రంగనాథ్, శోభారాణి, గొలివి మోహన్‌రావు, సాయి శ్రీనివాస్, గొండు సత్యం, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలకు గుర్తింపు



ఆమదాలవలస: గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న అప్పలనరసింహులు



హిరమండలం: గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న శ్రీధర్

ఆమదాలవలస: పట్టణానికి చెందిన ప్రముఖ బంగారం, దుస్తుల వ్యాపారి గుడ్ల అప్పలనరసింహులు (బాబు) గత కొన్నేళ్లుగా చేస్తున్న సమాజ సేవకు గుర్తింపు లభించింది. యూఎస్‌ఏకు చెందిన డేస్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఈయనకు డాక్టరేట్‌ను ఊటీలోని అనంతగిరిలో నిర్వహించిన కార్యక్రమంలో సోమవారం అందజేసింది. పట్టణానికి చెందిన పలువురు వ్యాపారవేత్తలు అభినందనలు తెలిపారు.

హిరమండలం: మండలానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు పోతురాజు శ్రీధర్‌కు, సంస్థ ఉపాధ్యక్షురాలు శాసనపురి ప్రతిభకు గౌరవ డాక్టరేట్ లభించింది. కోవిడ్ సమయం నుంచి నేటివరకు సంస్థ ఆధ్వర్యంలో అందించిన సేవలను గుర్తిస్తూ యూఎస్‌ఏకు చెందిన డేస్ప్రింగ్ అంతర్జాతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సోమవారం తమిళనాడులోని ఊటీ వేదికగా డాక్టరేట్ ప్రదానం చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలిపారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తా..



ఉపకార వేతనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస: నియోజకవర్గంలో అన్ని విభాగాలకు చెందిన ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాల (ఎన్‌ఎంఎంఎస్) పంపిణీ కార్యక్రమానికి సోమవారం హాజరయ్యారు. ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటుతోపాటు ఇంజినీరింగ్ ఐటీఐ కళాశాలల ఏర్పాటుకు తనవంతు కృషిచేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీతావిద్యాసాగర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కూన వెంకటరాజ్యలక్ష్మి, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, హెచ్‌ఎం బొడ్డేపల్లి రామకృష్ణ, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభానికి చర్యలు

ఆమదాలవల పట్టణంలోని రైతు బజార్ పక్కన అసంపూర్తి నిర్మాణంగా ఉన్న అన్న క్యాంటీన్ భవనాన్ని సిద్ధం చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ కె.అప్పలనాయుడును ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశించారు. అన్న క్యాంటీన్ భవనాన్ని సోమవారం సందర్శించారు. త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

హిరమండలం/ఎల్.ఎన్.పేట/కొత్తూరు/మెళియాపుట్టి/పాతపట్నం: మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మొక్కలతో పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా హిరమండలంలోని సుభలయ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఆదర్శ పాఠశాలలో, ఎల్.ఎన్.పేట మండలంలోని బొర్రంపేటలో, కొత్తూరు మండలంలోని కర్లెమ్మ ఆర్‌ఆర్ కాలనీలో, మెళియాపుట్టి మండలం జలకలింగుపురంలో, పాతపట్నం మండలంలోని ఆర్.ఎల్.పురంలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పశుగ్రాస విత్తనాల పంపిణీ



పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాతపట్నం: పాడి రైతులు తమ కున్న భూమిలో పది సెంట్లు పశుగ్రాసం సాగు చేయాలని పశువైద్యురాలు బి.శ్రీవాణి అన్నారు. మండలంలోని సీది పశు వైద్యశాల వద్ద పాడి రైతులకు పాశుగ్రాసం విత్తనాలు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి పశువులు ఎక్కువగా పెంచే రైతులు ఎకరం భూమిలో పశుగ్రాసం సాగు చేసుకోవాలన్నారు. రామారావు, లోకేష్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై కందిపప్పు అమ్మకం

పాతపట్నం: మండల కేంద్రంలో వినియోగదారుల వ్యవహారం, ఆహార పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఆరు దుకాణాల్లో రాయితీపై కందిపప్పు, బియ్యం అందజేస్తున్నామని సీఎస్‌డీటీ భీమారావు సోమవారం తెలిపారు. పాతపట్నంలోని కంట్రీమాల్, నీలమణిదుర్గ ఎంటర్‌ప్రైజెస్, సాయి ఎంటర్‌ప్రైజెస్, రామకృష్ణ ఎంటర్‌ప్రైజెస్, నవీన్, రత్నం, బుజ్జి కిరాణా దుకాణాల్లో కంది పప్పు రూ.160లు, బియ్యం సోనమసూరి (బీపీటీ స్టీమ్డ్) రూ.49, సోనమసూరి (బీపీటీ) రూ.48 అమ్మకం చేస్తున్నామని సీఎస్‌డీటీ తెలిపారు.

రైతులకు సహకరించాలి

మెళియాపుట్టి: వ్యవసాయపరంగా రైతుల సందేహాలను నివృత్తి చేయడంలో భాగంగా క్షేత్ర స్థాయి సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండేలా చూడాలని మండల వ్యవసాయశాఖ అధికారి ధానకర్ణుడుకు తహసీల్దార్ జానకమ్మ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, వీఏఏలతో సోమవారం సమీక్షించారు. కౌలు రైతులకు అన్ని విధాలా మేలు చేకూరేలా చూడాలని.. దానికి కావాల్సిన కౌలు కార్డులను అందించాలన్నారు.

సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే గోవిందరావుకు వినతిపత్రం ఫీల్డ్ అసిస్టెంట్లు

మెళియాపుట్టి: గత 17 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో గ్రామాల్లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ.. ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుంటూ పని చేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని ఉపాధి హామీ క్షేత్ర సహాయకుల సంఘ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు సోమవారం మండలంలోని జలకలింగుపురం గ్రామంలో కలిసి వినతిపత్రాన్ని అందించారు. జీతభత్యాలు పెంచాలని, అర్హత కలిగిన వారికి ఉద్యోగోన్నతులు కల్పించాలని, టార్గెట్ విధానం రద్దు చేయాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. క్షేత్ర సహాయకులు మండల ఉపాధ్యక్షుడు జగదీశ్వరరావు, శ్రీనివాసరావు, శేషగిరి రావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఇవేం పనులు!



పాతహిరమండలం వద్ద ఎడమ కాలువ గట్టు అంచున వేసిన పూడిక కాలువలోకి జారుతున్న దృశ్యం

హిరమండలం: మండల కేంద్రంలోని గొట్టా బ్యారేజీ వద్ద చేపడుతున్న పనుల తీరిది. ఎడమ ప్రధాన కాలువ సున్నా నుంచి ఐదు కిలో మీటర్ల మేర కలెక్టర్ జారీ చేసిన నిధులతో కాలువలో పూడిక తీత పనులు చేపట్టారు. ఈ పనులు పైపైన చేపట్టారు. కాలువ లోపల పూడికను, గట్టు అంచు భాగంలో తీసిన మట్టిని అలాగే విడిచిపెట్టారు. గత రెండురోజులగా కురుస్తున్న వర్షాలకు మట్టి తిరిగి కాలువలోకే జారిపోతుంది. నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉంటుందని రైతులు పెదవి విరుస్తున్నారు. ఇవేం పనుల అని మండి పడుతున్నారు. ఇప్పటికైనా పనులు సక్రమంగా చేపట్టాలని కోరుతున్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి

జి.సిగడాం: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ శాఖ జిల్లా కౌన్సిలర్ జనార్దనరావు, గౌరవ అధ్యక్షుడు సురేష్ కోరారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యవర్గం సమావేశంలో మాట్లాడారు. 2004 నుంచి పని చేస్తున్న ఉద్యోగులందరూ పెన్షన్ విధానం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు.